ప్రజాశక్తి
శుక్రవారం 24 మే 2024 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా







మచిలీపట్నం కోనేరు సెంటరులో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

అల్లర్ల నియంత్రణపై మాక్‌డ్రిల్

మచిలీపట్నంలో పోలీసు సిబ్బంది వినూత్న ప్రదర్శనలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : గొడవలు, విద్వేషాలు, అల్లర్లు సష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే జన సమూహాలను నియంత్రించే లక్ష్యంగా గురువారం కృష్ణాజిల్లా పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. మచిలీపట్నం కోనేరు సెంటర్లో పోలీస్ సిబ్బంది నిర్వహించిన ఈ మాక్ డ్రిల్‌ను జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి పర్యవేక్షించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక చర్యలు చోటు చేసుకోకుండా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బంది 'మాబ్ ఆపరేషన్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) జి వెంకటేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్‌విడి ప్రసాద్ నేతృత్వం వహించగా, జనసమూహానికి ఎస్‌బి సీఐ జేవీ రమణ అధ్యక్షత వహించారు. ఓవైపు ప్లకార్డులు చేతపట్టి ఆందోళనకారులు నిరసన తెలపడం, మరోవైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు, జన సమూహాలను నియంత్రించేందుకు మైక్ ద్వారా మొదటగా వార్నింగ్ ఇవ్వడం, అది వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతితో భాష్ప వాయువు ప్రయోగించడం, లాఠీఛార్జీ చేయడం, అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే అగ్నిమాపక సిబ్బందితో వాటర్ కెనాన్ ప్రయోగించడం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ వంటివి

(మిగతా 2లో)

డబ్బు ప్రవాహం

గన్నవరంలో వైసిపి, టిడిపి అభ్యర్థుల ఖర్చు రూ.200 కోట్లు ?


ప్రజాశక్తి - గన్నవరం

గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపి, టిడిపి అభ్యర్థులు డబ్బులు మంచినీళ్ల ప్రాయంలా ఖర్చు పెట్టారు. ఈఖర్చు సుమారు రూ.200 కోట్లపైనే అని రాజకీయ పరిశీలకుల అంచనావేస్తున్నారు. ఒకప్పుడు ఎన్నికల్లో అభ్యర్థులు చేసిన ఖర్చుకు, ఈసారికి ఎంతో వ్యత్యాసం కనిపించింది. రికార్డు స్థాయిలో డబ్బు పంపిణీ జరిగినట్లు తెలిసింది. రూ.500 నోట్ల కట్టలు కోట్లలోనే కరిగిపోయాయి. ఓట్ల కోసం విచ్చలవిడిగా డబ్బులు క్షేత్రస్థాయికి చేరాయి. ఎన్నికలంటే సహజంగా అభ్యర్థిత్వం ఖరారు, నామినేషన్ దాఖలు.. ప్రచార పర్వం, పోలింగ్ వంటివి పైకి కనిపిస్తాయి. వీటికి సంబంధించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అసెంబ్లీ అభ్యర్థులు పరిమితిలోపే ఖర్చు చేయాలి. ఈ లెక్కలన్నీ అధికారులకు తప్పనిసరిగా సమర్పించాలి. అయితే గన్నవరం అసెంబ్లీ స్థానంలో వైసిపి, టిడిపి అభ్యర్థులు రూ.200 కోట్లకుపైగా వెచ్చించారని రాజకీయ పరిశీలకుల అంచనా. అభ్యర్థులు నోట్లకు ఓట్లు రాలుతాయని బలంగా నమ్మి గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల్లోని 84 పంచాయతీల్లో ఓటర్లకు, నాయకులకు తాయిలాలు పంపిణీ చేశారు. ఎన్నికల సంఘం నిఘాకు చిక్కకుండా ఈ వ్యవహారాలను చక్కబెట్టారు. వీరిద్దరిలో ఒక్కొక్కరు తక్కువలో తక్కువ రూ.120 కోట్ల వరకు చేతిలో పెట్టుకుని బరిలోకి దిగారని పరిశీలకుల అంచనా.

బుజ్జగింపులు... పంపకాలు...

సొంత పార్టీలోని అసంతప్తులను బుజ్జగించడంతోపాటు వారి అనుచరుల ద్వారా ఓటు బ్యాంకును తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అభ్యర్థులు పెద్దఎత్తున ఖర్చు చేశారు. ప్రాంతాల వారీగా ప్రాబల్యం ఉన్న నాయకులను ప్రసన్నం చేసుకోవడానికి భారీ నజరానాలు సమర్పించారు. సామాజిక తరగతుల వారీగా కూడా పంపిణీలు చేశారు. పార్టీలు మారే వారిని కూడగట్టి డబ్బుతో కొనేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కొనుగోళ్లు ఎక్కువగా జరిగాయి. అధికార పార్టీలోనే కాకుండా ప్రతిపక్ష పార్టీలోనూ ఈ వ్యవహారం బహిరంగంగానే సాగింది. గెలుపే లక్ష్యంగా ఎవరికి వారు లక్షలాది రూపాయలు వెదజల్లి గ్రామ నాయకులను, పలుకుబడి గల వారిని తమ వైపుకు తిప్పుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రెండు నెలల ముందు నుంచి ఈ వ్యవహారం సాగింది. గుళ్ళు, గోపురాల

(మిగతా 2లో)



ఎన్నికల బరిలో నిలిచిన కొందరు అభ్యర్థులు లెక్కకు మించిన ఖర్చు చేస్తున్నారు. అయినా లెక్కల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన పరిమితిలోపే ఖర్చులు పూపుతున్నారు. ఈ క్రమంలో ఎన్నికల సంఘం ఎంఎల్ఎ అభ్యర్థుల ఖర్చు పరిమితిని రూ.28 లక్షల నుంచి రూ.40 లక్షలకు పెంచింది. అయితే వైసిపి, టిడిపి, బిజెపి, జనసేన అభ్యర్థులు పెట్టిన వాస్తవ ఖర్చులు చూస్తే మోత మోగిందని చెప్పొచ్చు. గన్నవరం నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూలేనంతగా వైసిపి, టిడిపి అభ్యర్థులు ఖర్చు, పంపిణీ రూపంలో సుమారు రూ.200 కోట్ల వరకూ ఖర్చుచేసినట్లు పరిశీలకులు చెబుతున్నారు.

4న ఓట్ల లెక్కింపునకు సన్నద్ధం

ఎన్‌టిఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటిస్తూ ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధం చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డిల్లీరావు... రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. సాధారణ ఎన్నికలలో భాగంగా కౌంటింగ్ కేంద్రాలలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సచివాలయం నుండి గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ముఖేష్ కుమార్ మీనా వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని క్యాంప్ కార్యాలయంలోని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపుకు అన్ని విధాల సన్నద్ధంగా ఉన్నామని, ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతతో కట్టుదిట్టంగా సిసి కెమెరాల నిఘాతో నిరంతరం అప్రమత్తంగా ఉన్నామన్నారు. కౌంటింగ్ కేంద్రాలు స్ట్రాంగ్ రూములు ఉన్న నోవా, నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలల వద్ద ఒక కంపెనీ సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్, 156 మంది స్పెషల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్, 477 మంది సివిల్ పోలీస్ ఫోర్స్‌తో పాటు 149 సిసి కెమెరాలను మానిటరింగ్ రూమ్‌కు అనుసందానం చేసి రోజు వారి నిరంతర పర్యవేక్షణతో భద్రత కల్పించామన్నారు. ఓట్ల లెక్కింపుకు సంబంధించి ఎప్పటికప్పుడు సమచారం అందించేందుకు వీలుగా మీడియా సెంటర్‌తోపాటు, అభ్యర్థులు, ఏజెంట్లకు తెలిపేవిధంగా పబ్లిక్ కమ్యూనికేషన్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో బ్యారీ కేడిరగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్, ఈవియంల కౌంటింగ్‌నకు అడిషనల్ ఏఆర్‌వోలు, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లను

(మిగతా 2లో)



విసిలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు, పక్కన జెసి సంపత్‌కుమార్

25న ఎపిపిఎస్‌సి పరీక్ష

8 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్‌సీ) ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాలకు పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీసెస్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాలకు శనివారం పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 1460 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే ఈ పరీక్షకు 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు జరుగుతుందన్నారు. నగరంలోని కండ్రికలోని ఇయాన్ డిజిటల్ జోన్, ఎస్ఎస్ ఫ్యూచర్ టెక్, వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ఎస్ఆర్‌కె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, క్యూ టెక్నాలజీ, ఎస్‌విటి ఇన్ఫో టెక్‌తోపాటు తిరువూరులోని శ్రీ వాహిణీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైలవరంలోని లక్కిరెడ్డి బాలిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ పరీక్ష కేంద్రాలలో డిజిటల్ ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 7.30 నుంచి 8.15 గంటల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. ఆపై ఆలస్యంగా వచ్చిన వారిని గ్రేస్ పిరియడ్‌లో 8.30 గంటల వరకు అనుమతిస్తామని తెలిపారు.

పంట కాల్వలను అభివృద్ధి చేయాలి

ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు

ప్రజాశక్తి - ఉయ్యూరు : కొద్దిరోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభంకానున్నా మురుగు, పంట కాల్వల అభివద్ధి పనులు మాత్రం ఇంకా ఎక్కడా ప్రారంభం కాలేదని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు అన్నారు. గురువారం ఆయన ఉయ్యూరు ప్రాంతంలో పూడిపోయిన పంట, మురుగు కాల్వలను పరిశీలించారు. అనంతరం హరిబాబు మీడియాతో మాట్లాడుతూ గత అనుభవాలను పరిశీలిస్తే... గత జూలైలో కురిసిన అధిక వర్షాలకు అనేక ప్రాంతాల్లో పొలాలు పూర్తిగా మునిగిపోయాయని తెలిపారు. ముఖ్యంగా కష్ణాజిల్లాలో కాల్వలు తూటు కాడ, గుర్రపు డెక్కతో నిండిపోవడంతో నాట్లు వేసిన పొలాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయని వివరించారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఉయ్యూరు పట్టణ, శివారు ప్రాంతాలైన కాటూరు, కడవకొల్లు, గండిగుంట ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్, అపార్టుమెంట్లు, నూతన భవనాల నిర్మాణం నిమిత్తం మురుగునీటి కాల్వలను పూడ్చివేయడంతో నీటి ప్రవాహం సరిగా జరగడంలేదన్నారు. ఈనేపథ్యంలో కొంతమంది రైతులు గత కొన్నేళ్ల నుండి పంటల సాగు మానేసి బీడు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్‌కు ముందే మురుగు, పంట కాల్వల అభివద్ధికి ప్రణాళికను రూపొందించి నిధులు కేటాయించాలని హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి వీరమాచనేని జ్యోతి, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు నెమ్మాది కనకారావు పాల్గొన్నారు.



ఉయ్యూరు ప్రాంతంలో పంట కాల్వను పరిశీలిస్తున్న ఎం.హరిబాబు, పి.రంగారావు తదితరులు

మొదటిపేజీ తరువాయి

డబ్బు ప్రవాహం

నిర్మాణానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఇచ్చేశారు. వ్యక్తిగత తాయిలాలు సరేసరే. అభ్యర్థుల బలహీనతను కొంతమంది నాయకులు సొమ్ము చేసుకున్నారనే వాదన కూడా ఉంది.

ప్రత్యేక సమావేశాలు

ప్రధానంగా వివిధ వర్గాల వారితో ఆయా పార్టీల అభ్యర్థులు సమావేశాలు నిర్వహించారు. రోజుకు మూడు నాలుగు సమావేశాలు ఏర్పాటు చేసి ఆయా వర్గాలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. వచ్చిన వారికి మంచి విందు భోజనాలు పెట్టారు. ఇక ప్రచారం చేసిన వారికి ఉదయం టీ, కాఫీ, అల్పాహారం నుంచి రాత్రి భోజనాల వరకు క్యాటరింగ్ ఏర్పాట్లు వంటివి చేశారు. వీరితో పాటు ఓటర్లకు మద్యం సరఫరా సరేసరి. ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో చేశారు. అలాగే నామినేషన్ వేసిన నాటి నుంచి పోలింగ్ రోజు వరకు రోజూ వినియోగించే అధికారిక, అనధికారిక వాహనాల అద్దెలు, సొంత వాహనాలు ఉన్న వారికి ఇంధనం సరఫరా వంటివి కూడా ఖర్చులో భాగంగానే ఉన్నాయి.

ప్రాంతాల వారీగా రేట్లు

నాలుగు మండలాల్లో గ్రామాలవారీగా కాసుల పంపకాలకు రేటు నిర్ణయించారు. అధికార పార్టీ వారు పోస్టల్ బ్యాలెట్‌కు ఒక్కోదానికి రూ.2500 చెల్లించారని తెలిసింది. ప్రతిపక్ష టిడిపి వారు కూడా అంతే మొత్తంలో చెల్లించి ఓట్లు కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఆతర్వాత ఓటర్లకు రూ.3 వేలు పంపిణీ చేసినా, నాయకుల ఒత్తిడితో పలు గ్రామాల్లో వ్యక్తిగతంగా మరో రూ.1000కి తగ్గకుండా అందజేసినట్లు సమాచారం. నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లలో స్థానిక పరిస్థితులను బట్టి 50 - 80 శాతం మందికి మాత్రమే పంపిణీ చేశారు. పట్టు తక్కువ ఉన్న ప్రాంతాల్లోని ఓటర్లకు ఒక్కొక్కరికీ రూ.4వేల వరకూ పంపిణీ చేసినట్లు తెలిసింది. నామినేషన్ రోజే పంచాయతీకి రూ.లక్ష తక్కువ లేకుండా వెచ్చించి జనసమీకరణ చేసినట్లు తెలిసింది. పోలింగ్‌కు రెండు మూడు రోజుల ముందు నాయకులు, మాజీ వాలంటీర్ల ద్వారా డబ్బులు పంపిణీ చేశారనే విమర్శలు ఉన్నాయి. అక్కడక్కడా ఈ రెండు పార్టీల నాయకులు చేతివాటం ప్రదర్శించినట్లు పోలింగ్ అనంతరం బయటపడింది. 60 నుంచి 80 శాతం మంది ఓటర్లకు పంపిణీ చేస్తామని చెప్పి డబ్బులు తీసుకుని ఆచరణలో 50 - 70 శాతం మందికి మాత్రమే పంపిణీ చేసి మిగిలిన డబ్బులు జేబులో వేసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని తెలిసింది. ఇలా వైసిపి, టిడిపి అభ్యర్థులు తమ గెలుపు కోసం ఇతరుల ఓట్లను డబ్బుతో చెల్లాచెదురు చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేశారని పరిశీలకులు భావిస్తున్నారు.

అల్లర్ల నియంత్రణపై మాక్‌డ్రిల్

ప్రదర్శించారు. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయడం, దీనిలో గాయపడిన వారిని అంబులెన్స్ సహాయంతో వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించడం వంటివి డెమో ద్వారా ప్రజలందరికీ పూర్తిగా అర్థమయ్యేలా ఎఆర్ సిబ్బంది ప్రదర్శించారు. అభిమానం అనేది పరిమితి వరకు ఉంటే ఎవరికీ ఎలాంటి నష్టం ఉండదని, అది హద్దు మీరినప్పుడే విధ్వంసకర పరిస్థితులకు దారితీస్తుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ విధ్వంసానికి ప్రయత్నించే అల్లరిమూకలను అణచి వేసేందుకు, జన సమూహాలను నిలువరించేందుకు, అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేలా ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి ఈ సందర్భంగా తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, అల్లర్లు, గొడవలు సష్టించే వ్యక్తుల పట్ల చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజలందరి సహకారంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా ముగిసిందని, ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని విద్రోహ చర్యలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో బందరు డిఎస్‌పి అబ్దుల్ సుభాన్, పట్టణ సిఐలు, రిజర్వ్ సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

4న ఓట్ల లెక్కింపునకు సన్నద్ధం

నియమించినట్లు తెలిపారు. ఈనెల 27న ఓట్ల లెక్కింపు పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేశామన్నారు. నోవా, నిమ్రా కళాశాలలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన పార్లమెంట్, అసెంబ్లీ ఓట్ల లెక్కింపుకు కౌంటింగ్ హాళ్లలో పార్లమెంట్, అసెంబ్లీకి ఒక్కొక్కదానికి 14 టెబుల్స్ చొప్పున ఏర్పాటు చేసున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకు పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేకంగా టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్, మైలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డా. పి. సంపత్ కుమార్, డిఆర్‌వో వి. శ్రీనివాసరావు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, డిఆర్‌డిఏ పిడి కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కౌంటింగ్ సిబ్బంది తొలి ర్యాండమైజేషన్ పూర్తి : డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : సాధారణ ఎన్నికలలో భాగంగా ఓట్ల లెక్కింపుకు సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, ఎస్. డిల్లీరావు తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఛాంబర్‌లో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విజయవాడ పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపునకు 403 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, 504 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 364 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తంగా 1271 మంది కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్‌ను పూర్తిచేశామని తెలిపారు. ఈప్రక్రియలో జెసి, మైలవరం రిటర్నింగ్ అధికారి డా. పి.సంపత్ కుమార్, డిఆర్‌వో వి. శ్రీనివాసరావు, ఎన్ఐసి డిఐఒ రేవతి, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ యం.దుర్గా ప్రసాద్, ఇ డిస్ట్రిక్ట్ మేనేజర్ సిహెచ్.గోపి సుధాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ఎస్.డిల్లీరావు

విద్యార్థులకు ఇంగ్లీషులో శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నర్ పేటలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు బొడ్డపాటి చంద్ర శేఖర్ స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ ఇంగ్లీషు మాట్లాడటం, అర్థం చేసుకోవటం, రాయటం చేయాలని, కేవలం మాట్లాడటం పైనే దష్టి పెడితే ఇంగ్లీషు భాష రాదని పేర్కొన్నారు. నిత్య జీవితంలో ఇంగ్లీషు పదాలు వాడటం అలవాటు చేసుకుంటే భాషపై మెల్లగా పట్టు వస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు టంగ్ ట్విస్టర్స్ పలకటంలో శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కె.రమా దేవి పాల్గొన్నారు.



వివిధ అంశాల్లో గ్రంథాలయంలో శిక్షణ



ప్రజాశక్తి - విజయవాడ : సత్య నారాయణ పురంలోని చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులలో భాగంగా గురువారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. పుస్తక సమీక్షలు చేసి నీతి కథలు చదివించారు. రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ టి సుబ్బన్న గణితంలో, కేంద్రీయ విద్యాలయం రిటైర్డ్ సోషల్ సీనియర్ టీచర్ సాంఘిక శాస్త్రంలో, రిటైర్డ్ లెక్చరర్ బి.సావిత్రి, కె.కనకదుర్గా దేవి తెలుగు పద్యాలు, శ్లోకాలు, టీచర్ టి.అన్నపూర్ణ యోగా, ధ్యానం, ఆసనాల్లో శిక్షణ ఇచ్చారు. అనంతరం క్లాసికల్ డాన్స్‌లో పోటీలు నిర్వహించారు. చిన్నారి శ్రీ తన్వి మొదటి స్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి. సంపత్ కుమార్ పాల్గొన్నారు.

సస్పెండ్ చేసిన ఆర్‌టిసి సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్నికల కోడ్ ఉల్లంఘన పేరుతో సస్పెండ్ చేసిన ఆర్‌టిసి సిబ్బందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిపిటిఒకు ఎపిపిటిడి (ఆర్‌టిసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ అధ్యక్షులు సిహెచ్.పరమేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఏలూరు ఎఒ కార్యాలయ ఎస్ఎ (ఎఫ్) సిహెచ్.సుందరరావు, మంగళగిరి డిపో కండెక్టర్ పద్మావతి, తణుకు డిపో డ్రైవర్లు సిహెచ్.శ్యాంసన్, సుబ్బారావులను ఎన్నికల కోడ్ ఉల్లంఘన పేరుతో సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్య హక్కులకు, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. పత్రికల్లో వచ్చిన వార్తలు, వాట్సాప్ మెసేజ్‌ల ఆధారంగా సస్పెండ్ లాంటి తీవ్ర చర్యలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు.

మాతా, శిశు మరణాలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవించకుండా కషిచేయాలని కలెక్టర్ ఎస్.డిల్లీరావు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ డిల్లీరావు... జిల్లాలో చోటుచేసుకున్న మాతా, శిశుమరణాలపై వైద్య, ఆరోగ్యశాఖ జిల్లాస్థాయి అధికారులతో సమీక్షించారు. డిసెంబర్ 23 నుండి ఏప్రిల్ 24 వరకు జిల్లాలో జరిగిన మాత శిశు మరణాలకు సంబంధించిన నివేదికలను పరిశీలించారు. ఈసమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.సుహాసిని, డి.సి.హెచ్.ఎస్ డా.బి.సి.కె నాయక్, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి, జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డా. అమత, డిప్యూటీ డియంహెచ్ఓ డా.ఇందుమతి, టి.బి వైద్యాధికారి డా.పద్మావతి, డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ డా.లిడియా, పిహెచ్‌సిల వైద్యాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిల్లీరావు, చిత్రంలో డిఎంహెచ్ఒ సుహాసిని

మద్యం సేవించి వాహనాలు నడిపిన 15 మందికి జైలు, జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ

మద్యం సేవించి వాహనాలు నడిపిన 15 మందిని న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు. గురువారం 3వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 15 కేసులలో మద్యం సేవించి వాహనాలు నడిపిన చోదకులను సంబంధిత రైల్వే కోర్ట్‌లో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఆర్.వి.శర్మ ఒకరికి ఏడు రోజులపాటు జైలు శిక్ష, నలుగురికి ఒక్కొక్కరికి మూడు రోజులపాటు జైలు శిక్ష, మిగిలిన 10 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి జయసూర్య

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-గన్నవరం : ఎన్నికల కౌంటింగ్ తర్వాత గ్రామాల్లో ఎక్కడైనా అల్లర్లు గొడవలు సష్టిస్తే అలాంటి వ్యక్తులను జైలుకు పంపిస్తామని డిఎస్‌పి జయసూర్య హెచ్చరిం చారు. బాపులపాడు మండల కేంద్రమైన హనుమాన్ జంక్షన్‌లో గురువారం జూన్ 4వ తేదీసాధారణ ఎన్నికలకు ఓట్లు లెక్కింపు జరిగే రోజున పాటించవలసిన నియమ నిబంధనలు గురించి రాజకీయ పార్టీ నాయకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. జయ సూర్య.. మాట్లాడుతూ పోలింగ్ తర్వాత ఎవ్వరూ ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. రోడ్ల మీదకు వచ్చి హడావుడి చేయకూడదని చెప్పారు. గొడవలు జరిగితే చాలా సీరియస్ యాక్షన్ ఉంటుందన్నారు. ప్రజలు, రాజకీయ నాయకులు ప్రశాంత వాతావరణం ఉండేందుకు సహకరించాలన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ జంక్షన్ సబ్ ఇన్స్పెక్టర్ నరసింహమూర్తి. శిక్షణ డిఎస్పి వేదశ్రీ, జంక్షన్, ఎస్సై జనార్ధన్ వీరవల్లి సబ్ ఇన్స్పెక్టర్ చిరంజీవి ,జంక్షన్2 అర జమ్మ. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా నక్క గాంధీ. ప్రభు కిరణ్ చలపతి. జనసేన పార్టీకి చెందిన నియోజకవర్గ ఇన్చార్జి చలనశెట్టి రమేష్ బాబు. టిడిపికి చెందిన వేములపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

ఆంజనేయులుకు సత్కారం

ప్రజాశక్తి - గుడివాడ : విశ్రాంత డైట్ ప్రిన్సిపాల్ ఎమ్.వి.జి ఆంజనేయులు మరిన్ని పురస్కారాలు అందుకోవాలని పలువురు వక్తలు అన్నారు. ఫ్రెండ్స్ ప్రోగ్రసివ్ ఫ్రెంట్ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయంలో తెలుగు వెలుగు మహానంది పురస్కార గ్రహీత ఆంజనేయులును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ జన్ను చిరంజీవిరావు, ఫ్రంట్ కన్వీనర్ డిఆర్‌బి ప్రసాద్, దూలుపూడి విజయ రాంబాబు, మోకా మాధవరావు, సయ్యద్ గఫార్, అవిర్నేని వెంకటేశ్వరరావు, గాదె మోహన్ బాబు, గొల్లేరు శ్రీనివాసరావు, చింతలూరి సత్యనారాయణ, బాదరవాడ ధర్మరాజు, ఎల్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్నా... డబ్బులు వేయాలని సైబర్ మోసం



ప్రజాశక్తి-గన్నవరం : ఫ్రెండ్.. ఏం చేస్తున్నావ్.. ఎలా ఉన్నావ్.. నీవు బాగున్నావు కదా.. నా జీవితమే సరిగా లేదు.. చాలా కష్టాల్లో ఉన్నాను. వెంటనే నా అకౌంట్ కి రూ.5 వేలు ట్రాన్స్ ఫర్ చేయి.. ఇదిగో నంబర్.. ఈ మెసేజ్ చూడ గానే.. పాత మిత్రులు స్పందించి వెంటనే డబ్బులు పంపారు.. ఒకరోజు తర్వాత తన స్నేహితుడికి ఫోన్ చేసి డబ్బులు పంపాను? తీసుకున్నావా అని అడిగారు.. డబ్బులు ఏంటి? పంపడమేంటి?. అని..ఆశ్చర్య పోవడం అతని వంతు అయింది. తీరా పరిశీలన చేస్తే.. తన పేరు, ఫోటోతో వాట్సప్ అకౌంట్ క్రియేట్ చేసి దాంట్లో డబ్బులు కావాలని మెసేజ్ పెట్టినవివరాలు బయట పడ్డాయి. డబ్బులు పంపిన అకౌంట్ నెంబర్ ని పరిశీలిస్తే అది అస్సాం అకౌంటుగా బయటపడింది.. స్నేహితులకు ఫోన్ చేసి మీ డబ్బులు ఎవడో కొట్టేసాడని చెప్పడంతో విస్తుపోయారు. ఇలాంటి సైబర్ మోసం గురువారం గన్నవరంలో జరిగింది. వివరాల్లోకి వెళితే... గన్నవరం మండలం కొండ పావులూరు గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి ఫోటోలు ఫేస్బుక్ ద్వారా సేకరించి వాట్సప్ లో ఒక నంబరుకు ఆ ఫోటోను యాడ్ చేశారు. ఫేస్బుక్ లోనే నాగరాజు స్నేహితుల వివరాలు నంబర్లు సేకరించారు. ఈ నకిలీ వాట్స్అప్ నెంబర్లో స్నేహితులందరినీ యాడ్ చేసి మెసేజ్ లు పెట్టడం ప్రారంభించారు. నేను చాలా ఇబ్బందుల్లో ఉన్నానని, ఆర్థికంగా సాయం చేసి ఆదుకోవాలని, వెంటనే రూ.5వేలు పంపాలని ఓ అకౌంట్ నెంబర్ పెట్టారు. ఆ మెసేజ్లు చూసిన స్నేహితులు నాగరాజు నిజంగానే ఇబ్బందుల్లో ఉన్నాడని అనుకుని డబ్బులు ట్రాన్స్ఫర్ చేశారు. డబ్బులు పంపిన విషయాన్ని నాగరాజు కు ఫోన్ చేయడంతో అసలు విషయం బయటపడింది. పలువురు డబ్బులు ట్రాన్స్ఫర్ చేయడం జరిగింది. ఆ డబ్బులు అస్సాం అకౌంట్ కి వెళ్లిపోయాయి. తన పేరుతో నకిలీ అకౌంట్ క్రియేట్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలుసుకొని తెలుసుకున్న నాగరాజు అయోమయానికి గురయ్యారు. తన స్నేహితులందరికీ ఫోన్ చేసి నకిలీ వాట్స్అప్ నెంబర్ కు తన ఫోటో పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని, దయచేసి ఎవరూ డబ్బులు పంపవద్దని రిక్వెస్ట్ పెట్టాడు. సైబర్ మోసాల్లో.. ఇది ఒకటిగా చెబుతున్నారు. అస్సాం, గుజరాత్, బీహార్ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు, దొంగలు మన ఫోన్ నెంబర్లను యాక్ చేసి తప్పుడు మెసేజ్లతో డబ్బులు దండుకుంటు న్నారు. ఇప్పటికైనా యువకులు మేలుకొని ఇలాంటి మోసాల బారిన పడొద్దని కోరుతున్నారు.

పొన్నపల్లి మృతికి సంతాపం



ప్రజాశక్తి - గుడివాడ : పట్టణ విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత ఉపాధ్యాయుడు పొన్నపల్లి బాలశివ రామ ప్రసాద్ (63) గురువారం మృతి చెందారు. గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన విజయవాడలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. పట్టణంలోని పలు పాఠశాలలో ఆయన ఉపాధ్యాయ విధులు నిర్వహించి, మూడేళ్ళ క్రితం ఉద్యోగ విరమణ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. స్దానిక రాజేంద్రనగర్ లోని ఆయన స్వగహంలో వుంచిన భౌతిక కాయాన్ని సంఘ నాయకులు భవిరి శంకరనాథ్, చింతలూరి సత్యనారాయణ, వసుధ బసవేశ్వర రావు పలువురు సంఘీయులు, ఉపాధ్యాయులు గురువారం సందర్శించి పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరాలు

ప్రజాశక్తి-గన్నవరం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని రిటైర్డ్ హిందీ పండిట్ కంభంపాటి ధర్మారావు అన్నారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ ఏశిబిరం గురువారం కొనసాగింది. విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించి, మహనీయుల జీవిత చరిత్రల గురించి వివరించారు. ఈ సందర్భంగా ధర్మారావు వాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాలయాలు కీలక భూమిక పోషించాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు గ్రంథాలయాల ఆవశ్యకతను కూడా తెలుసుకో వాల్సిన అవసరం ఉందన్నారు. గ్రంథాలయ ఇన్చార్జి డి.బాబూరావు, రామచంద్రరాజు, రమణ తదిత రులు పాల్గొన్నారు ముస్తాబాద శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. సీనయర్స్, జూనియర్స్ రెండు విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి కె. జ్యోతికుమారి తెలిపారు.

విద్యార్థినీ విద్యార్థులు గ్రంథాలయాల్లో జరిగే తరగతులకు హాజరవ్వటం ద్వారా వారిలో మేథోవికాసం మరింతగా పెరుగుతుందని ఉంగుటూరు మండలం మానికొండ గ్రామంలోని బ్రాంచి గ్రంథాలయం అధికారి ఎల్.హరికష్ణ అన్నారు. పిల్లలకు వేసవి సెలవుల సందర్భంగా ప్రత్యేకంగా వేసవి విజ్ఞాన తరగతులు గత ఎనిమిదిరోజులుగా ఉత్సాహ పూరితవాతావరణంలో కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ విద్యార్థులతో కథలు చదివిస్తున్నారు. చక్కని చేతిరాతపై పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చదరంగం , క్యారమ్స్ , లూడో వంటి ఆటలు పోటీలు సైతం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గన్నారు.

ప్రజాశక్తి-ఉయ్యూరు : స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం రిసోర్స్ పర్సన్ జి.రిషికిరణ్ విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్, ఇంగ్లీ షులో మాట్లాడడం నేర్పించారు. అనంతరం యోగా సనాలు నేర్పించి వాటివల్ల ఆరోగ్యానికి ప్రయోజనాలు తెలియజేశారు. గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేయడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** గ్రంథాలయ సంస్థ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం మండలంలోని ఉంగుటూరు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఉప్పలపాటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పిల్లలకు పుస్తక పఠనం, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ వేసవిలో విద్యార్థిని, విద్యార్థులకు అన్ని విధాలా, అన్నింటిలోనూ ప్రావీణ్యం పొందేలా తరిఫీదు ఇవ్వాలనే ధృడనిశ్చయంతో గ్రంథాలయ సంస్థ ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోందని, దీనిని అందరూ వినియోగించుకోవాలి అని సూచించారు. **ప్రజాశక్తిలి-అవనిగడ్డ :** వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా అవనిగడ్డలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ విభాగాలలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోస్ట్మాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రంథాలయాల ప్రాధాన్యత విద్యార్థులు గ్రంథాలయాల ద్వారా ఏ విధంగా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలనే అంశాన్ని వివరించారు. ఈ సందర్భంగా కథలు చదవడం, కథలు చెప్పడం, పుస్తక పఠనం, చిత్రలేఖనం, తెలుగు పద్యాలు, పాటలు భవద్గీత డాన్స్ నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం శేషగిరిరావు, వి రమేష్, ఏ సుమన్, గ్రంథాలయ అధికారి జే ప్రభుదాస్, సిబ్బంది పాల్గొన్నారు.



మానికొండలో..



అవనిగడ్డలో...

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



మృతుడు కార్తీక్

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం మద్దూరు గ్రామంలో కష్ణానదిలో ఈతకు వెళ్లిన ఆరుగురు యువకులలో కరాని కార్తీక్ (13) ప్రమాదవ శాత్తువు నది లో మునిగి మృతి చెందాడు. పెనమలూరు మండలం తాడిగడప లోని కార్మిక నగర్ కు చెందిన కార్తీక్ నాలుగు రోజుల క్రితం అమ్మమ్మ ఇంటికి సెలవులు నిమిత్తం వచ్చాడు. గురువారం స్నేహితులతో కలసి కృష్ణానదిలో ఈతకు వెళ్లి నీటిలో మునిగి చనిపోయాడు. కుమారుడి తండ్రి కారని నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

ఎన్‌టిఆర్ స్టేడియం క్రీడాకారులకు పతకాలు

ప్రజాశక్తి - గుడివాడ : ఈ నెల 20వ తేదీన తిరువూరు పట్టణంలో కష్ణా ఎన్.టి.ఆర్. జిల్లాల స్థాయిలో ఉమ్మడి కష్ణా జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఎన్‌టిఆర్ స్టేడియం క్రీడాకారులు పలు పతకాలను సాధించారు. గురువారం స్దానిక స్టేడియం కార్యాలయంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ నెల 29వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరగబోయే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీలకు కష్ణా జిల్లా జట్టు తరుపున ఎన్.టి.ఆర్. స్టేడియం లిఫ్టర్లు ఎంపికయ్యారు. పతక గ్రహీలను ఎన్.టి.ఆర్. స్టేడియం జిమ్ కోచ్ మారెళ్ళ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ జంపా ఉషాకుమారి, స్టేడియం మేనేజర్ సత్యనారాయణ తదితరులు అభినందించారు.

బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక ఏఏఎన్ఎం అండ్ వివిఆర్ఎస్ఆర్ ఇఎం స్కూల్ కొత్త ప్రిన్సిపాల్‌గా సాతులూరి లీనా గురువారం బాధ్యతలు చేపట్టారు. 1988 జూన్ 27 న ప్రారంభమై, గత36 సంవత్సరాల కాలంగా బాగా నడుస్తున్న ఈ స్కూల్ పిన్సిపాల్‌గా సాతులూరి లీనా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ సొసైటీ మేనేజ్‌మెంట్ సలహాదారు డాక్టర్ పొట్లూరు రవీంద్ర బాబు, గుడ్లవల్లేరుపాలిటెక్నిక్ ఎగ్జిక్యూటివ్ మెంటర్ ఎన్ .ఎస్ .ఎస్ .వి రామాంజనేయులు(శేఖర్), ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డా? బుర్రా కరుణ కుమార్, పాలిటెక్నిక్ అకడమిక్ కో-ఆర్డినేటర్ జి.వి.వి.సత్యనారాయణ, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎన్ రాజశేఖర్, పూర్వ హెడ్మాస్టర్ జి.మురళీకష్ణ , స్కూల్ డైరెక్టర్, బి.చంద్రం, ఉపాధ్యాయులు, మరియు స్టాఫ్ పాల్గొన్నారు .



లీనాను అభినందిస్తున్న దృశ్యం

కౌంటింగ్ ఏజెంట్లూ ఇవి గుర్తుంచుకోండి...

ప్రజాశక్తి-విజయవాడ

ఎన్నికల ఫలితాలు వెల్లడించే సమయంలో వివిధ పార్టీల ఏజెంట్లు పలు అంశాలను గమనంలో ఉంచుకోవాలి. ఫారం 17సి, కంట్రోల్ యూనిట్ సీలు, అధికారుల సంతకాలు, ఓట్ల నమోదు సంఖ్య తదితర అంశాలను క్షుణ్ణంగా గమనించిన తరువాతే కౌంటింగ్‌కు సంసిద్ధత తెలపాల్సి ఉంది.

కౌంటింగ్‌కు ముందు...

1.ఫారం 17సి దగ్గర ఉంచుకోవాలి. ఎన్నికలు అయిన తేదీ నాడే ప్రిసైడింగ్ అధికారి ఏజెంట్లతో సంతకం చేసినదే తీసుకోవాలి. ఈ ఫారం 17సి ఏజెంట్లు సంతకాలు లేనిదైతే ఏదో అవకతవకలు జరిగినట్లు భావించాలి.

2. ప్రతి పోలింగ్ కేంద్రంలోని ఫారం 17సిలో ఉన్న కంట్రోల్ యూనిట్ నెంబరు, మిషన్ పైన ఉన్న నెంబరు సరి చూసుకోవాలి. పోలింగ్ రోజున ఏదైనా సమస్య వచ్చినప్పుడు కంట్రోల్ యూనిట్ మార్చినా అది ఫారం 17సి మార్చినట్లు చూపించి ఉండాలి. ఒక వేళ ఆ నెంబరు మ్యాచ్ కాకపోతే కౌంటింగ్ ఆపి ఆర్ఓతో సంప్రదించి కౌంటింగ్ ప్రారంభించాలి.

3. ఫారం 17సిలో నమోదైన ఓట్ల సంఖ్య, కంట్రోల్ యూనిట్‌లో చూపిస్తున్న ఓట్ల సంఖ్య సమానంగా ఉండాలి. ఒక వేళ లేకపోతే రిటర్నింగ్ అధికారిని అడిగి నివృత్తి చేసుకున్న తర్వాత కౌంటింగ్ ప్రారంభించాలి.

4. కంట్రోల్ యూనిట్‌కు ఉన్న అన్ని సీళ్లను ఫారం 17సీలో వున్న నెంబర్లతో సరిగా ఉన్నాయా లేదా ఖచ్చితంగా సరిచూసుకోవాలి.

5. మిషన్ పైన సీళ్లు ఏవైనా చిరిగి ఉన్నాయా లేదా తనిఖీ చేసుకోవాలి. ఇది అతి ముఖ్యమైన అంశం.

6. కంట్రోల్ యూనిట్ అన్ని సీళ్లపై ఏజెంట్లు, అధికారుల సంతకాలు ఉంటాయి. అవి సరిగ్గా ఉన్నాయా లేదా సరిచూసుకోవాలి. అనుమానం వస్తే నివృత్తి చేసుకొన్న తర్వాతే కౌంటింగ్ ప్రారంభించాలి.

7. పోలింగ్ సమయంలో ఏదైనా పోలింగ్ కేంద్రంలో సాంకేతిక కారణాలతో మరో మిషన్ వాడి ఉంటే, వాటి వివరాలు కూడా ఫారం 17సీ నమోదు చేసి వాటి వివరాలు కూడా సరి చూసుకోవాలి.



రిజల్ట్ బటన్ నొక్కిన తర్వాత గుర్తించాల్సిన అంశాలు

1. నియోజకవర్గంలో నోటాతో కలిపి పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్యను చూపించాలి.

2. పోలింగ్ కేంద్రంలో నమోదైన ఓట్ల సంఖ్య 17సీలో పోలైన ఓట్లతో సమానంగా ఉండాలి.

3. కంట్రోల్ యూనిట్‌లో పోలింగ్ తేదీ, పోలింగ్ ప్రారంభం, ముగింపు సమయం గంటలు, సెకన్లతో సహా చూపిస్తుంది. వాటిని సరిచూసుకోవాలి.

పైన తెలిపిన అన్ని విషయాలపై సంతృప్తి చెందినట్లు అయితేనే ప్రతి రౌండ్‌లో కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించడానికి సంసిద్ధత తెలపాలి.



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఇఒ

నేటి నుండి తుమ్మలపల్లిలో చాగంటి ప్రవచనాలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ శుక్రవారం నుండి తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుచే ఆధ్యాత్మిక ప్రవచనాలు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్. రామారావు తెలిపారు. రెండు రోజుల పాటు 24, 25వ తేదీలలో సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుచే ఆధ్యాత్మిక, ధార్మిక ప్రవచనం ఏర్పాటు నేపథ్యంలో ఆలయంలోని వివిధ విభాగాల అధికారులతో గురువారం ఆలయ కార్యనిర్వాహనాధికారి కె.ఎస్. రామారావు సమావేశమై ఏర్పాట్లు, సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఉరేసుకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని షేర్ మహమ్మద్ పేట అడ్డరోడ్డు సమీపంలోని రావికంపాడు రెవెన్యూ పరిధిలోని పొలంలో జరిగింది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షేర్ మహమ్మద్ పేట అడ్డరోడ్డుకు చెందిన యలక గోపిరెడ్డి (35) లారీ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. బుధవారం రాత్రి డ్యూటీ చేయుటకు ఇంటి నుండి బయటకు వచ్చిన గోపిరెడ్డి అడ్డరోడ్డు సమీపంలోని రావికంపాడు రెవిన్యూ పరిధిలోని పొలంలో వేప చెట్టుకు ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన వారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చిల్లకల్లు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గోపిరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తరలించారు. భార్య విజిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌర గ్రంథాలయం ఆదేశానుసారం ఏడో రోజు గురువారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులచే పుస్తక పఠనం, కథలు చెప్పినారు. తదుపరి ఆటవిడుపగా విద్యార్థులచే పాటతో అంత్యాక్షరి మరియు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆలేటి ప్రభ, సిబ్బంది శ్యామల, రమేష్, సత్యవతి పాల్గొన్నారు.

మాగల్లులో బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-నందిగామ: మాగల్లు గ్రామంలో శ్రీ వైకుంఠ నారాయణ క్షేత్రంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. గురువారం ఏఎస్‌ఎంసి సేవాసమితి సభ్యులు పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాములు అంగర రాంబాబు ఆచార్యుల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామికి విశేష అర్చనలు, శ్రీ చెంచులక్ష్మి రాజ్యలక్ష్మి సమేత నారా శివ స్వామి దివ్య కళ్యాణం జరిగింది.



వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి గ్రామంలో శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త శ్రీమతి డాక్టర్ వెలగపూడి ఇందిరాదత్తు ఆధ్వర్యములో బుధవారం రాత్రి 11 గంటలకు ఎదురుకోలోత్సవం, అనంతరం 12 గంటలకు శ్రీ భూనీళ రాజ్యలక్ష్మీ, చెంచు లక్ష్మీ సహిత శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. కల్యాణం అనంతరం తెల్లవారుజామున స్వామి వారికి గజవాహన సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ, సహాయ కమిషనర్ కె.శాంతి, కెసిపి నుండి శ్రీనివాస్, రామ్ ప్రసాద్ పాల్గొన్నారు. శ్రీ బాల త్రిపుర సుందరి అమ్మవారి ట్రస్టు, కె.సి.పి. లిమిటెడ్ ముక్త్యాల వారి సౌజన్యముతో యాత్రికులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం మహాజన అన్నదానం నిర్వహించారు. శ్రీ స్వామి వారికి, అమ్మవార్లకు దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి ఇందిరాదత్తు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, పూలు, పూల దండలు, కళ్యాణ పూజా సామాగ్రి సమర్పించారు. కళ్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సతీమణి సామినేని విమలభాను పాల్గొన్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాటు చేసినట్లు దేవస్థాన కార్యనిర్వాహణాధికారిణి శిరపరపు హేమలత దేవి తెలిపారు.



చెరుకు రసం పంపిణీ

ప్రజాశక్తి-నందిగామ

సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో వెయ్యి మందికి ఉచితంగా చెరుకు రసం పంపిణీ చేశారు. గురువారం రామిరెడ్డిపల్లి భవిత ఫెర్టిలైజర్ అధినేత బొద్దులూరి నరసింహారావు కుమార్తె భవిత పుట్టినరోజు సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కోటి సూర్యం తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి-మైలవరం

పుస్తక పఠనం ద్వారానే విజ్ఞానాభివద్ధి జరుగుతుందని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు డివిఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థిని విద్యార్థులతో నీతి కథలు చదివించి చెప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీవీలు, సెల్ ఫోన్లకు అలవాటు పడకుండా విద్యార్థిని విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చేటట్లు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కంభంపాడులో పోలీసు కవాతు



ప్రజాశక్తి-ఎ.కొండూరు

మండలంలోని కంభంపాడు గ్రామంలో గురువారం ఏసీపీలు ఎస్.మురళీమోహన్, కె.ప్రకాష్‌రావుల ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సోదాలు నిర్వహించి 34 ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ భద్రత దృష్ట్యా ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. రికార్డులు సరిగ్గా లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో చిన్న చిన్న సంఘటనలు మినహా ఎన్నికల ప్రశాంతంగా జరిగాయని ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాతో పాటు మైలవరం సబ్ డివిజన్లో 144 సెక్షన్ అమలులో ఉందని అందువల్ల నలుగురు మించి ఒకచోట ఉండకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరువూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ అబ్దుల్ నబీ తదితరులు పాల్గొన్నారు.

కళాకృతులకు ప్రాణం పోసిన చిన్నారులు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

చిన్నారుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయాలనే ముఖ్య ఉద్దేశ్యంతో నగరానికి చెందిన స్పహాప్తి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పటమట దేవీ లిటిల్ స్టార్స్ పబ్లిక్ స్కూల్ లో జరుగుతున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం పేపర్ క్విల్లింగ్ అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు/వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అయప్ప నగర్‌కి చెందిన ప్రముఖ యువ చిత్రకారిణి, పేపర్ క్విల్లింగ్ ఆర్టిస్ట్ మేడా సింధూశ్రీ ముఖ్య అతిథిగా విచ్చేసి చిన్నారులకు పేపర్ క్విల్లింగ్ ఆర్ట్‌కి సంబంధించిన సమాచారాన్ని తెలియపరిచి మెళుకువలను నేర్పించారు. ఈ సందర్భంగా మేడా సింధూశ్రీ మాట్లాడుతూ కళలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయనీ దానితో పాటు ఏకాగ్రత, సృజనాత్మకత, పరిశీలనాత్మక శక్తి సామర్థ్యాలు మెరుగుపడతాయని తద్వారా చిన్నారులు తమ రెగ్యులర్ స్టడీస్ లో కూడా రాణించగలరని అన్నారు. అనంతరం చిన్నారులకు పేపర్ ముక్కలతో చిన్న చిన్న కళాకతులు ఎలా తయారు చేయాలో నేర్పించి తదుపరి వారందరి చేత చక్కటి పేపర్ క్విల్లింగ్ మరియు ఓరిగామి వర్క్స్ చేర్పించారు. చిన్నారులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ కళా నైపుణ్యంతో అతిథులను, నిర్వాహకులను, వారి తల్లిదండ్రులను అబ్బురపరిచారు. ఈ కార్యక్రమాన్ని స్పహాప్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ భారతీ దేవి వీరంకి పర్యవేక్షించగా టీం సభ్యులు పద్మ, మాధురి, కవిత, లీపాక్షి, పద్మలత తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్పహాప్తి చారిటబుల్ ట్రస్ట్ తరపున సభ్యులందరూ కలిసి మేడా సింధూశ్రీని సత్కరించారు.



మేడా సింధూశ్రీని సత్కరిస్తున్న నిర్వాహకులు



ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అనుగుణంగా ఓట్ల లెక్కింపునకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎంకే మీనా గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జూన్ 4న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై సమీక్షించారు .జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్సుకు హాజరై జిల్లాలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు ఎన్నికల సంఘం సీఈఓ కు వివరించారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు మే 13న పోలింగ్ జరిగిన నేపథ్యంలో కష్ణ విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలో జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టటకు పటిష్టవంతమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గం పార్లమెంటు, అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు వేరు వేరు కౌంటింగ్ హాళ్ళు ఏర్పాటు చేసినట్లు, పార్లమెంటు, అసెంబ్లీ ప్రతి నియోజకవర్గానికి 14 చొప్పున టేబుళ్ళు, ప్రతి టేబుల్ కు కౌంటింగ్ సూపర్వైజర్ తో పాటు ఇద్దరు కౌంటింగ్ సహాయకులు, ఒక్కొక్క మైక్రో అబ్జర్వర్ లను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. వీరికి విధులు కేటాయించుటకు ఈనెల 26వ తేదీన మొదటి ర్యాండమైజేషన్, జూన్ 3 తేదీన రెండవ ర్యాండమైజేషన్ నిర్వహిస్తామన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల సంఖ్యను బట్టి 15 నుండి 22 రౌండ్ల వరకు ఫలితాలు ప్రకటిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు పార్లమెంట్ నియోజకవర్గం 14 టేబుళ్ళు, 4 రౌండ్లు, అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలైన బ్యాలెట్ సంఖ్యను బట్టి టేబుళ్ళు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి మే 28, జూన్ 3 వ తేదీల్లో రెండు పర్యాయాలు కౌంటింగ్ శిక్షణ నిర్వహిస్తామన్నారు.. డిఆర్ఓ కె చంద్రశేఖరరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సమన్వయ అధికారి దుర్గా కిషోర్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు .



ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సాధారణ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పట్ల ఓట్ల లెక్కింపు సిబ్బందికి సంపూర్ణ అవగాహన కలిగించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాస్టర్ ట్రైనర్లకు సూచించారు. కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాల్లో గురువారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ రిహార్సల్స్ నిర్వహించి మాస్టర్ ట్రైనర్లకు అవగాహన కల్పించారు. ఈసీ మార్గదర్శకాలు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల సందర్భంగా జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టవలసి ఉన్నందున, ఇప్పటికే ఓట్ల లెక్కింపు కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు తూచా తప్పక పాటిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించి ఫలితాలు ప్రకటించవలసి ఉందని కలెక్టర్ సూచించారు. అందుకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండేలా మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో ప్రతి టేబుల్ కు కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్ నిర్వర్తించవలసిన విధులు కూలంకశంగా వివరించారు. ప్రతి రౌండ్ ఫలితాలు ప్రకటనకు తీసుకోవాల్సిన చర్యలు వివరించి, ఫలితాలు డిస్ప్లే చేయవలసి ఉంటుందన్నారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియలో చేయవలసిన విధులు పాయింట్ల వారీగా ప్రతి టేబుల్ పై అంటించాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, బందరు ఆర్డిఓ ఎం వాణి, శిక్షణ నోడల్ అధికారి మురళీ కిషోర్, మ్యాన్ పవర్ నోడల్ అధికారి ఆనంద్ కుమార్, ఎన్నికల విభాగం సమన్వయ అధికారి దుర్గాకిశోర్ తదితరులు పాల్గొన్నారు .



విద్యార్థినులను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు సత్కారం

ప్రజాశక్తి-చల్లపల్లి : విద్యారంగంలో ఆడపిల్లలు తమ శక్తి సామర్థ్యాలతో చాటుతున్న ప్రతిభా పాటవాలను సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు అన్నారు. మచిలీపట్నం కేంద్రీయ విద్యాలయం లో పదవ తరగతి, ఇంటర్ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలు కుంపటి అక్షయ, మౌళి, రేవళ్ల అపూర్వలను స్థానిక బి.ఆర్ అంబేద్కర్ సేవా సదన్ లో గురువారం ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సురేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పలు పోటీ పరీక్షల్లో బాలుర కంటే బాలికలు మెరుగైన ఫలితాలు సాధించడం శుభ పరిణామమని అన్నారు. విద్యార్థులు వివిధ కోర్సుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు దేవరపల్లి కోటయ్య,అడ్వకేట్ కుంపటి ప్రసాద్, కేంద్రీయ విద్యాలయం టీచర్లు ఆర్.విజయకుమార్, అరుణ కుమారి, ఆర్టీసీ ఉద్యోగి కె.స్వామిదాసు,కిషోర్ ఆరోగ్య కార్యకర్త కే.అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : గత నెల 24వ తేదీన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు నామినేషన్ సందర్భంగా బాణసంచా పేల్చడంతో ఆ నిప్పు రవ్వలు పడి యాసం వెంకటేశ్వరరావుకు చెందిన గృహం పూర్తిగా దగ్ధమ యింది. దీనితో ఎన్నారై జనసైనికులు ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. గురువారం వెంకటేశ్వర కుటుంబ వద్దకు ఎన్నారై జనసేన ప్రతినిధులు పద్యాల శివరాం ప్రసాద్ మోహన్ కష్ణ సాదు మాధవ తో కలిసి మాజీ ఉపసభాపతి, అవనిగడ్డ జనసేన పార్టీ అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ బాధిత కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడి వారిని ఆదుకోవడంలో జనసైనికులు ఎప్పుడూ ముందుంటారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మతి వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, ఎన్నికల నిర్వహణ పార్లమెంట్ కమిటీ సభ్యులు చిలకలపూడి పాపారావు, అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, అవనిగడ్డ పార్టీ అధ్యక్షులు రాజనాల వీరబాబు, మోపిదేవి మండల పార్టీ అధ్యక్షులు పోషణపు రత్న గోపాల్ పాల్గొన్నారు



చెక్కును అందజేస్తున్న బుద్ధ ప్రసాద్, ఎన్ఆర్ఐ జనసేన ప్రతినిధులు

కోతులబారి నుంచి కాపాడాలని వినతి

ప్రజాశక్తి-గన్నవరం : మండలంలోని పెరికీడు గ్రామపంచాయతీ పరిధిలోని సుందరయ్య కాలనీలో కోతుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం సిపిఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ కోతులు సృష్టిస్తున్న విధ్వంసం వల్ల కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. గత నెల నుండి కోతులు ఇళ్లలోకి ప్రవేశించి వస్తువులు సామాన్లు పాడు చేస్తూ, మనుషుల మీద దాడి చేసి కొరకడం చేస్తున్నాయని చెప్పారు. ఇంటి బయటకు రానివ్వట్లేదని, రోడ్లమీద గుంపులు గుంపులుగా ఉండ డంతో ఒంటరిగా ఎవరైనా వెళితే వారిని దాడులు చేస్తున్నాయని తెలిపారు. ఏలూరు కాల గడ్డమీద పంపు వద్ద మంచినీళ్లు తెచ్చుకోవడానికి వెళితే చిన్నపిల్లల మీద ఈ దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోతులను పట్టించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోతులను పట్టించి దూరంగా అడవుల్లో వదిలి పెట్టాలన్నారు. అనంతలక్ష్మి, కుమారి, సీతమ్మ సరస్వతమ్మ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్ఎస్‌లో కృష్ణచైతన్యకు 74వ ర్యాంక్

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామానికి చెందిన యువ ఇంజనీర్ తుమ్మల కృష్ణచైతన్య 2023 విభాగంలో యుపిపిఎస్సి నిర్వహించిన జాతీయస్థాయి సివిల్ పరీక్షలలో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామినేషన్ - 2023లో జాతీయ స్థాయిలో 74వ ర్యాంక్ సాధించి ఐఎఫ్ఎస్ కు ఎంపికయ్యారు. కృష్ణచైతన్య తండ్రి తుమ్మల వీర రాజారావు ఉద్యోగరీత్యా తిరుపతిలోని నవత ట్రాన్స్‌పోర్ట్ లో ఉన్నారు. కృష్ణచైతన్య ప్రాథమిక విద్యఅంతా తిరుపతిలోనే కొనసాగించారు. ప్రాథమికస్థాయి నుంచి మెరిట్ విద్యార్థి అయిన కృష్ణచైతన్య 2008లో 528 మార్కులతో 10వ తరగతి, 2010లో ఇంటర్మీడియట్ లో 937 మార్కులు సాధించి తరవాత ఎంసెట్ లో మంచి ర్యాంక్ సాధించి జె.ఎన్.టి.యు అనంతపురం నుంచి 2014 లో కెమికల్ ఇంజినీరింగ్ లో పట్టభద్రుడయ్యారు. అనంతరం తల్లిదండ్రులు, రంగన్నగూడెం గ్రామస్తులు ఇచ్చిన ప్రోత్సాహంతో ఐఏఎస్ కావాలనే బలమైన కోరికతో 2014లో ఢిల్లీలో కోచింగ్ తీసుకున్న అనంతరం ఇంటిదగ్గరే సొంతంగా ప్రిపేర్ అవుతూ 2016నుంచి సివిల్స్ పరీక్షలు రాస్తూ 4వ ప్రయత్నంగా 2023లో జరిగిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామినేషన్ క్యాటగిరిలో జాతీయస్థాయిలో 74వ ర్యాంక్ సాధించారు. భారతదేశ వ్యాప్తంగా ఐఎఫ్ఎస్ రాత పరీక్షకు సుమారు 3 లక్షలమంది హాజరవ్వగా 1,800 మంది మాత్రమే రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఆ 1,800మందిని మౌఖిక పరీక్షకు పిలవగా అన్నిక్యాటగిరీలు కలిపి అంతిమంగా 150 మంది ఎంపికయ్యారు, అందులో కృష్ణ చైతన్య 74 ర్యాంక్ సాధించారు. ఈ అనుభవంతోనే 2018లో జరిగిన ఎపిపిఎస్సి గ్రూప్ 2 పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన కష్ణచైతన్య ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఎ.ఎస్.ఓ) గా విధులు నిర్వహిస్తూనే ఐఎఫ్ఎస్ కు ఎంపికవ్వడం విశేషం. కష్ణచైతన్య ఐఎఫ్ఎస్ లో జాతీయస్థాయిలో 74వ ర్యాంక్ సాధించటం పట్ల గ్రామ ప్రముఖులు, సాగునీటి



వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకష్ణారావు, గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ, ఎంపీసిఎస్ అధ్యక్షులు మొవ్వా శ్రీనివాసరావు, పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు తుమ్మల ధశరథరామయ్య, మాజీ సర్పంచ్ లు శ్రీమతి ఆళ్ళ మణికష్ణ, నత్తా ప్రసన్నరావు తదితరులు అభినందనలు తెలియచేశారు. ఇప్పటికే రంగన్నగూడెం గ్రామంలో గతంలో జరిగిన సివిల్స్ పరీక్షలలో గ్రామానికి చెందిన పుసులూరు రవికిరణ్ జాతీయస్థాయిలో 655 ర్యాంక్ సాధించి ఐసిఎల్ఎస్ కు ఎంపికై ఢిల్లీలో ఉన్నతస్థానంలో ఉద్యోగం చేస్తుండగా ప్రస్తుతం రంగన్నగూడెం గ్రామానికి చెందిన కష్ణచైతన్య రెండవవాడిగా ఐఎఫ్ఎస్ కు ఎపికవ్వటంపట్ల రంగన్నగూడెం గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఫుజి కెమెరా వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం డివిజన్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు రాష్ట్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన మంగళవారం ప్రముఖ ఫుజి కెమెరా కంపెనీ వారిచేత మచిలీపట్నంలో వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా లేటెస్ట్ కెమెరాలు గురించి పూర్తి అవగాహన కలిగించే లాగా ఈ వర్క్ షాప్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ వర్క్ షాప్‌లో ప్రముఖ ఫ్యాకల్టీ, తెలంగాణ ఫోటో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ హుస్సేన్ పాల్గొని నూతన టెక్నాలజీ గురించి ఫుజి కెమెరా గురించి పూర్తిగా వివరిస్తారన్నారు. ఈ సందర్భంగా వర్క్ షాప్ పోస్టర్ను బుదవారం లాంచనంగా ఆవిష్కరించారు. మచిలీపట్నం డివిజన్ ఫోటో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలకుర్తి శేషు, సెక్రటరీ అనంత్ కుమార్, ట్రెజరర్ శ్రీరామ్ వైస్ ప్రెసిడెంట్ కైతా సత్యనారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

31 ద్విచక్రవాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలంలోని అల్లినాకిపాలెంలో పోలీసులు కార్డన్ సెర్చ్ గురువారం నిర్వహించారు. గుడివాడ డిఎస్‌పి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిఐ కిషోర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో 31 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బాణాసంచా కాల్చడం, గోలలు చేయటంలాంటివి చేస్తే కఠిన చర్యలుంటాయన్నారు. గ్రామాల్లో ఎవరైన అనుమానిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.





విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుగుతున్నాయని గ్రంథాల అధికారిణి పద్మావతి తెలిపారు. విద్యార్థులకు చదరంగం, చెస్, క్యారం బోర్డు ఆటలతో పాటు దేశ భక్తి గీతాలు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలను వివరిస్తున్నట్లు చెప్పారు. డిబెట్, క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామన్నారు.

ఎంఇఒ చిట్టిబాబు సస్పెన్షన్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట మండల విద్యాశాఖ అధికారి ఎల్ చిట్టిబాబును కాకినాడ ఆర్‌జెడి నాగమణి గురువారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండల విద్యాశాఖ అధికారి ఎల్ చిట్టిబాబు గత నెల 30వ తేదీన పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణపై విచారణ నిమిత్తం వెళ్లారు. ఈ సంఘటనలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం వాణి తనను కావాలని ఎంఇఒ ఇబ్బందులకు గురి చేశారని ఆరోపిస్తూ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ అనంతరం ఎంఇఒను సస్పెండ్ చేస్తూ నాగమణి ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్చార్జి ఎంఈఓగా నందిగామ సుబ్బరాజుకు బాధ్యతలు అప్పగించారు.

బావిలోకి దిగి యువకుడు మృతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పెనుగంచిప్రోలు మండలం ముక్షింతాల గ్రామానికి చెందిన నలుగురు యువకులు గురువారం బలుసుపాడు గ్రామ శివారు పొలంలో నీళ్లబావిలో ఈతకు దిగారు. బావి పైనుండి నీళ్లలోకి దూకిన యువకుడు కార్తీక్ (19) పైకి రాకపోవడంతో ఆందోళన చెందిన స్నేహితులు గ్రామస్తులకు సమాచారం అందించారు. బావిలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టగా అప్పటికే కార్తీక్ మృతిచెందాడు. చిలకలు ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- హెల్త్ యూనివర్సిటీ: మైలవరం గ్రామ పంచాయతీ, రమేష్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల నాల్గో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డాక్టర్ వెంకట రామిరెడ్డి ఇంటి వద్ద కల రమేష్ స్పెషాలిటీ క్లినిక్ నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామనీ ప్రముఖ వైదులు డాక్టర్ రమేష్ బాబూ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం నందు ఉచితంగా బి.పి, ఈ.సీ.జీ, షుగర్ పరీక్షలు చేస్తారని మైలవరం మరియు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు.

గృహ రుణాల్లో ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ వృద్ధి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఐఐఎఫ్ఎల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ అసెస్ మేనేజ్‌మెంట్ ఇయర్‌లో 25 శాతం వృద్ధి సాధించినట్లు సంస్థ రీజనల్ హెడ్ కె.ఎం.ప్రకాష్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. 2023 ఆర్థిక సంవత్సరంలో 2,712 కోట్ల నుండి 2024 ఆర్థిక సంవత్సరం నాటికి 3317 కోట్లకు పెరిగిందని తెలిపారు. అన్ని హౌసింగ్ కంపెనీలలో అతి తక్కువ ఖర్చు ఆదాయ నిష్పత్తులను నిర్వహిస్తుందని తెలిపారు. గృహ రుణాలను సులభతరంగా అందించడంలో తమ సంస్థ ముందుంటుందని తెలిపారు. రానున్న కాలంలో మరింత వృద్ధి సాధించేందుకు ఇప్పటి నుండే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

లూబ్రికెంట్ స్క్రూ కంప్రెషర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఈఎల్‌జీఐ నుండి పర్మనెంట్ ఆయిల్ లూబ్రికేటెడ్ స్క్రూ కంప్రెసర్స్ అందుబాటులోకి తీసుకువచ్చిన సంస్థ మార్కెటింగ్ హెడ్ మహేశ్వర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఎయిర్ కంప్రెసర్ తయారీ దారులలో ఒకటైన ఈ ఎల్ జీ ఐ ఎక్విప్మెంట్ సంస్థ తమ ఈజీ సిరీస్ శ్రేణి కి అప్ గ్రేడ్ చేస్తూ ఆయిల్ లూబ్రి కెంట్ స్క్రూ ఎయిర్ కంప్రెసర్ పరిచయం చేసినట్లు తెలిపారు.అత్యాధునిక ఈజీ పి ఎం 15 శాతం వరకు మెరుగైన సామర్థ్య లాభాలను అందిస్తుందని తెలిపారు.

వైభవంగా దుర్గమ్మ గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడి కార్యనిర్వహణాధికారి కెఎస్ రామారావు, ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం దుర్గమ్మ గిరి ప్రదక్షిణ వైభవోపేతంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణలు, అమ్మవారి నామ స్మరణలు, మంగళ వాయిద్యముల నడుమ శ్రీ కామధేను అమ్మవారి ఆలయం (ఘాట్ రోడ్ ఎంట్రన్స్) వద్ద శ్రీ స్వామి, అమ్మవార్లుకు ఆలయ వైదిక సిబ్బందిచే గురువారం ఉ.5.55 గంటల సమయంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్విహించి, ఆలయ ఈవో కె.ఎస్. రామారావు



గిరిప్రదక్షిణ కార్యక్రమంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు విశేషంగా పాల్గొన్నారు. గిరిప్రదక్షిణ కార్యక్రమం శ్రీ కామధేను అమ్మవారి ఆలయము, కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్థంబాల సెంటర్, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, ఘాట్ రోడ్ మీదుగా డప్పులు, బేతాల నత్యములు తదితర సాంస్కతిక కార్యక్రమాల నడుమ తిరిగి ఆలయానికి చేరుకున్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

దుర్గమ్మను రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.టి.రవికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ ఇఒ కె.ఎస్. రామారావు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. దుర్గమ్మ దేవస్థానంకు వచ్చే యాత్రికుల సౌకర్యార్థం నగరానికి చెందిన వెలగపూడి శంకం బాబు, శ్రీదేవి దంపతులు అమ్మవారి ఆలయం వద్ద ఆర్జిత సేవా కౌంటర్ పక్కన రూ.80 వేలు



విలువ చేసే 160 లీటర్ల వాటర్ కూలర్‌ను గురువారం ఆలయ అధికారులకు బహూకరించారు. అమ్మవారి ఆలయం స్వర్ణ తాపడం పనుల నిమిత్తం మేడ్చల్ చెంగిచర్లకు చెందిన అనంతాల శంకర్ రూ.2 లక్షలను ఆలయ ఈవో కె.ఎస్. రామారావుకు అందజేశారు.



పచ్చిరొట్ట సాగుతో ఎన్నో ప్రయోజనాలు



ప్రజాశక్తి-వత్సవాయి: రైతులు వారి భూములను ఖాళీగా ఉంచకుండా పచ్చిరొట్ట పైర్లు సాగు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు పచ్చిరొట్ట సాగు పశువులకు గ్రాసంగా కూడా ఉపయోగపడుతుందని అన్నారు. రైతులు పశువులకు మేత కోసం లాడుకోకుండా వారి పొలాల్లోనే ప చ్చిరట్ట సాగు కోసం విత్తనాలు చల్లుకుంటే ఆ గ్రాసమే పశు వులకు మేతగా ఉపయోగపడుతుందని రైతులు పేర్కొన్నారు. అంతేకాకుండా పశువులు లేని రైతులు వారి పొలాల్లో పచ్చిరొట్ట కలిపి దున్నుకుంటే భూసారం పెరుగుతుందని అన్నారు. పచ్చిరొట్ట పైర్లు మినుము, పెసర, పిల్లి పెసర, జీలుగులు, జనుము, వంటివి రైతులు సాగు చేసుకోవాలని తెలుపుతున్నారు. వేసవిలో కాలే భూములుగా ఉంచి నాగార్జునసాగర్ నీరు గ్రామంలోని పొలాలు దున్ని హడావుడిగా నార్లు పోస్తున్నారని అన్నారు. రసాయన ఎరువులు వాడకాలు తగ్గించి సేంద్రియ ఎరువులు ఉపయోగాలు కావాలని అదే విధంగా పంటలు పండించుకోవాలని జరుగుతున్నారు. సేంద్రియ ఎరువులు వాడకం వలన అధిక దిగుబడులు కూడా సాధించవచ్చు అని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. పచ్చిరొట్ట సాగువలన భూమి గుల్లగా మారి నీటిని పోషక నిలవలను ఉంచుకునే శక్తి పెరుగుతుంది. మొక్కలు వేర్లు కు పోషకాలకు గాలి నీరు బాగా అందుతుంది. కలుపు మొక్కల ఉధతిని తగ్గిస్తుంది. పంటలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. చీడపీడలు తక్కువగా ఆశిస్తాయి. భూమిలో ఉన్న సౌర శాతాన్ని తగ్గిస్తుంది సూక్ష్మ పోషక పోషకాలు అందుతాయి అని వ్యవసాయ శాఖ అధికారి రవికుమార్ తెలిపారు.

ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి- నందిగామ: నందిగామ పట్టణంలో పెద్ద మసీదు లో ఉన్న హజరత్ సయ్యద్ మీరాహుస్సేనిషా ఖాదరి రహమతుల్లా అలై వారి 268వ ఉర్సు ఉత్సవాలు, గంధం ఊరేగింపు అత్యంత పవిత్రంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించటానికి ముస్తాబు అవుతున్నాయి. ఈ ఉత్సవాలకు అనేక ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున ముజవర్లు,భక్తులు పాల్గొంటారని దర్గా ముజవర్ షేక్ పాషా గురువారం తెలిపారు. 25వ తేది శనివారం సాయంత్రం 4 గంటలకు గంధం, ఉర్సు ఉరేగింపు పట్టణంలోని అర్టీసి బస్టాండ్ ఎదురుగా గల డ్రైవర్ గౌసుల్లా ఇంటి వద్ద నుండి సన్నాయి మేళములు, భారీ లైటింగ్ తో గంధం ఊరేగింపు బయలుదేరుతుంది. 26వ తేదీ ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు అత్యంత భక్తి శ్రద్ధలతో దీపారాధన జరుగును. ఈ కార్యక్రమం గత 268 సంవత్సరాలుగా తమ పూర్వకులు, అనంతరం తాము నిర్వహిస్తున్నట్లు దర్గా ముజవర్ షేక్ పాషా పేర్కొన్నారు. ఉత్సవ ఏర్పాట్లను నిర్వహకులు కరీముల్లా, ఖాజామొహీద్దీన్, హనీఫ్, మహబుబ్ జానీ, జిలాని, జానీ పర్యవేక్షిస్తున్నారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు దర్గా ముజవర్ షేక్ పాషా కోరారు.



వికలాంగ పిల్లల వివరాలు సేకరణ

ప్రజాశక్తి-కంచికచర్ల: జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు భవిత జిల్లా కో ఆర్డనేటర్ మహేశ్వరరావు, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎల్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కంచికచర్ల మండలంలో వికలాంగ పిల్లల వివరాలపై సర్వే నిర్వహిస్తున్నారు. మే ఒకటో తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు సర్వే నిర్వహించనున్నట్లు కో ఆర్డినేటర్ మహేశ్వరరావు గురువారం తెలిపారు. భవిత సెంటర్ ఉపాధ్యాయులు ఎం కనకారావుతో కలిసి ఆయన సర్వే జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 180 మంది వికలాంగుల పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. వీరందరిని ఈ విద్యా సంవత్సరం నుండి భవిత సెంటర్లో చేర్పించి విద్యాబుద్దులు నేర్పిస్తామన్నారు. డ్రాపవుట్స్ పిల్లలను కూడా గుర్తించి వారిని కడా తిరిగి భవిత సెంటర్లో చేరే విధంగా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. భవిత సెంటర్లో చేరిన పిల్లలకు ప్రభుత్వం ప్రతినెలా ప్రయాణ ఖర్చుల నిమిత్తం 300 రూపాయలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అంధ విద్యార్థులకు 300 రూపాయలు అఅందజేస్తుందన్నారు. వీటితో పాటు ప్రభుత్వం రాయితీలతోపాటు సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు.

దేవినేని ఉమా గృహ నిర్బంధం

ప్రజాశక్తి-భవానీపురం

ఈ నెల 13వ తేదీన జరిగిన పోలీంగ్ సందర్భంగా వైసీపీ గూండాల దాడులలో గాయపడిన బాధితులను పరామర్శించేందుకు ఛలో మాచర్లకు తెలుగుదేశం పార్టీ గురువారం పిలుపిచ్చింది. ఈ నేపధ్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ (గొల్లపూడి)లో టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమాను భవానీపురం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సిఐ డి. దుర్గా ప్రసాద్, సిఐలు, సిబ్బంది ఇంటి నుండి బయటకు వచ్చిన దేవినేని ఉమాను బయటకు వెళ్ళకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మీడియాతో మాట్లాడారు.



వైసిపి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదు

ప్రజాశక్తి-తుళ్లూరు: రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు చేస్తున్న దీక్షలు గురువారంతో 1619వ రోజుకు చేరాయి. అమరావతి రాజధానిని నిర్వీర్యం చేసిన వైసిపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రైతులు స్పష్టం చేశారు. 2019 ఎన్నికలకు ముందు అమరావతి రాజధానికి అనుకూలంగా మాట్లాడి అధికారంలోకి వచ్చాక మూడు రాజధానులంటూ మాట మార్చిన జగన్మోహన్‌రెడ్డి రెండు నాల్కల ధోరణిని రాష్ట్ర ప్రజలు గమనించారని, ఆయన ప్రజల ఛీత్కారానికి గురికాక తప్పదని విమర్శించారు. తుళ్లూరు, వెంకటపాలెం, అనంతవరం, వెలగపూడి తదితర గ్రామాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి. జై అమరావతి, బిల్డ్ అమరావతి - సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు, చిన్నారులు ప్ల కార్డులు ప్రదర్శించారు. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించారు.



ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు ద్వారా విద్యార్థి దశ నుండి ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డికే బాలాజీ అధికారులకు సూచించారు .జిల్లా కలెక్టర్ గురువారం కలెక్టరేట్లో విద్యాశాఖ అనుబంధ శాఖల అధికారులు, ఉద్యాన,ప్రకతి వ్యవసాయ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహిస్తున్న రీతిలో ప్రకతి వ్యవసాయం పట్ల విద్యార్థి దశ నుండి అవగాహన కల్పించినట్లయితే భవిష్యత్తులో భావితరాలు ప్రకతి, సేంద్రియ వ్యవసాయం చేపట్టి న్యూట్రిషన్ పోషక విలువలు కలిగిన ఆహారం సమాజానికి అందించవచ్చన్నారు. ఈ లక్ష్యంతో పాఠశాల విద్య సంబంధిత శాఖలు, ప్రకతి వ్యవసాయం, ఉద్యాన శాఖల సంయుక్త సహకారంతో పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటుకు పాఠశాలలను ప్రోత్సహించే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రకతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలో 119 ఆర్బీకేల పరిధిలో గల పాఠశాలల్లో రిసోర్స్ పర్సన్స్ ద్వారా న్యూట్రి గార్డెన్స్ పట్ల తగిన తర్ఫీదు ఇవ్వాలని, ఇందుకోసం ప్రహరీ గోడ గల పాఠశాలల జాబితా సిద్ధంచేయాలని, ఈ కార్యక్రమానికి డిఈఓ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఉద్యాన శాఖ అధికారులు అవసరమైన విత్తనాలు సరఫరా చేయాలన్నారు. జూన్ 12న పాఠశాలలు తెరిచే నాటికి ఈ కార్యక్రమానికి ఒక రూపు తేవాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డి ఈ ఓ తాహెరా సుల్తానా, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జే.జ్యోతి, నాచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పార్థసారథి, సూక్ష్మ సేద్య ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మి, జిల్లా వయోజన విద్యాశాఖ డిడి తదితరులు పాల్గొన్నారు .



గుడివాడలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు



విద్యార్థినికి సత్కారం

ప్రజాశక్తి-కోడూరు : ఈ సంవత్సరంలో జరిగిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 600 మార్కులకు 586 మార్కులు సాధించి మచిలీపట్నం డివిజన్‌లో ప్రథమ స్థానం సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ స్వతంత్రపురంకు చెందిన విద్యార్థిని యర్రారెడ్డి ఉజ్వలను జిల్లా విద్యాశాఖ తరపున జిల్లా విద్యాశాఖ అధికారిని తాహెరా సుల్తానా మెమొంటోస్ జ్ఞాపిక దశ్యాలువాలతో సత్కరించి అభినందనలు తెలియచేశారు. అలాగే చామర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చిరంజీవి (586 మార్కులు) అఖిల్ (584 మార్కులు)లను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి శేఖర్ సింగ్, డిస్టిక్ కామన్ బోర్డ్ సెక్రెటరి జాన్ సాహెబ్, కోడూరు మండల విద్యాశాఖ అధికారి వన్ టివిఎం రాందాస్, ఎంఈఓ 2 శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏవీ రమణ పాల్గొన్నారు.

గుడివాడ మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-గుడివాడ రూరల్: గుడివాడ మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపిపి గద్దె పుష్ప రాణి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల వారీగా అధికారులతో రివ్యూ నిర్వహించి మండలం స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ఇప్పటికే అమలవుతున్న వివిధ అభివద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికై తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ మట్ట నాగమణి, వైస్ ఎంపీపీ బట్టు నాగ మల్లీశ్వరి, ఎండిఒ కె. జ్యోతి , ఈవోపిఆర్డి డి. వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ లు, వివిధ శాఖల మండల అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి :** మండలం వేసవికాలంలో గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపిపి గోగం సురేష్ అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రమైన పెదపారుపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ రైతులకు విత్తనాలు సకాలంలో అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - గుడివాడ : ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం డి.వి. సత్యనారాయణ సహకారంతో ఎ.జి.కే హైస్కూల్ రోడ్‌లోని చిన్నంగంగాధర్ ఇంటి వద్ద సుమారు 500 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు పామర్తి కేశవరావు, సెక్రటరీ డి.వి. సత్యనారాయణ, ట్రెజరర్ ఎన్. శేషగిరిరావు, బి.తిరుపతయ్య, ఎం.వీరశేఖర్, గంట చంద్రశేఖర్, కసెట్టి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీర రాఘవులు మృతికి పలువురు సంతాపం





వీరరాఘవులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ రమేష్, జనసేన నాయకులు బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు దిడ్ల వీర రాఘవులు మతికి పలు పార్టీలకు చెందిన ప్రముఖులు సంతాపం తెలిపారు. గురువారం అశ్వరావు పాలెం గ్రామంలోని రాఘవులు భౌతికకాయాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సింహాద్రి రమేష్ సందర్శించి బాబు, కష్ణ గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు సందర్శించి పూలదండలు వేసి నివాళు లర్పించారు. ఎమ్మెల్యే తో పాటు ఆయన తనయుడు సింహాద్రి వికాస్, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు. అదే విధంగా జనసేన పార్టీ అవనిగడ్డ నియోజకవర్గం అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ రాఘవులు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు బం డే రాఘవ, పుల్లగోరు రాజేంద్ర రావు, కొండవీటి మధుసూదన్ రావు పాల్గొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వింత సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు దనేకుల మురళీమోహన్, అవనిగడ్డ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అందే శ్రీరామ్ మూర్తిలు నివాళులర్పించారు . ఈ కార్యక్రమంలో నాగాయలంక మండల పార్టీ అధ్యక్షులు బి మా శ్రీనివాసరావు, కోడూరు మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటేశ్వరరావు పాల్గొని నివాళులర్పించారు.

ఘనంగా బుద్ధ జయంతి



ఘంటసాలలో..

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల గ్రామంలో బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల బౌద్ధ స్తూపం వద్ద ధమ్మ ధజ బంతిజె ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ కమీషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొరిపాటి వెంకట రామకష్ణ, టిడిపి నాయకులు బండి పరాత్పరు రావు అయినపూడి భాను ప్రకాష్, మణికంఠ పాల్గొన్నారు.

చీరలు పంపిణీ : ఘంటసాల గ్రామంలోని అమరావతి బుద్ధ విహార్‌లో గౌతమ బుద్ధ జయంతిని పురస్కరించుకొని పేదలకు చీరల పంపిణీ చేశారు. బౌద్ధ బిక్షువుదజ బంతేజి ఆర్థిక సహకారంతో సమకూర్చిన ఈ చీరలను మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకష్ణ, టిడిపి నాయకులు బండి పరాత్పరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి, గుడివాడ రూరల్ :** బిల్లపాడు గ్రామంలో అంబేద్కర్ సెంటర్ వద్ద గౌతమ బుద్ధుని 2568 జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ రామకష్ణ మాట్లాషవసెఱ. తదనంతరం విద్యార్థులకు స్వీట్స్ పంచారు ఈ కార్యక్రమంలో వంశి ,రాజా, మల్లికార్జునరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఉపాధ్యాయ ట్రైనింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-గన్నవరం : 2024-25 విద్యా సంవత్సరానికి స్పెషల్ డీఈడీ టీచర్ శిక్షణ ట్రైనింగ్(ఐడీడీ) కోర్సుకు ఎటువంటి ఎంట్రన్స్ లేకుండా ప్రత్యేక ఉపాధ్యాయ శిక్షణ ట్రైనింగ్ కు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కష్ణాజిల్లా గన్నవరంలో ఉన్న హెల్పింగ్ హ్యాండ్స్ డీఈడీ స్పెషల్ టిచర్ ట్రైనింగ్ కాలేజి సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్ అన్నారు. గురువారం హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ కార్యాలయంలో రజిత వెంకట్ మాట్లాడుతూ ప్రత్యేక విద్యలో డీ.ఈ.డీ చదివితే చిన్న వయసులోనే ఉన్నతమైన భవిష్యత్తు ఉంటుందని,స్పెషల్ డీ.ఈ.డీ ట్రైనింగ్ కొరకు ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ పూర్తి చేసేవారు అర్హులని అన్నారు. ఒసి అభ్యర్థులకు 50 శాతం బిసి,ఎస్సి, ఇ.డబ్ల్యూ.సి, ఎస్టి, దివ్యాంగ అభ్యర్థలకు 45 శాతం ఇంటర్మీడియట్ లో వచ్చిన వారు అర్హులని రజిత వెంకట్ తెలిపారు. ఈ కోర్సు అప్లై చెయ్యడానికి జూన్ 14 వరకు మాత్రమే అవకాశం ఉందని, ఆసక్తి గల అభ్యర్థులు కాలేజి లో డైరక్ట్ గా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. మరిన్ని వివరాలు కొరకు 9154947771, 9100874 698 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని రజిత వెంకట్ తెలిపారు.

బిఎన్‌పురంలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి శివారు వెంకటనరసింహపురం కాలనిలో గురువారం గన్నవరం సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పోలీసులు కాటన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని సెర్చ్ చేసి ఇళ్లలో ఉన్న వారి వివరాలు నమోదు చేసుకోవడం జరిగింది. ఎటువంటి రికార్డులు లేని పలు వాహనాలను సీజ్ చేసి స్టేషన్ కు తరలించారు. ఈ సెర్చ్ లో గన్నవరం, ఉంగుటూరు, మచిలీపట్నం ఎస్పీ స్పెషల్ పార్టీ చెందిన పోలీసులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** గుడివాడ డి.ఎస్.పి పి. శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి గుడివాడ రూరల్ సర్కిల్ పరిధిలోని గుడివాడ మండలం మల్లాయిపాలెం శివారు శ్రీకాళహస్తి కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీలలో 11 ద్విచక్ర వాహనాలుకు సంబంధించి సరైన పత్రాలు సమర్పించకపోవడం గుర్తించారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీకాంత్ మాట్లాడుతూ చట్ట వ్యతిరేకంగా మద్యం, పెట్రోల్, డీజిల్ వంటివి కలిగి ఉండరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ తాలూకా సి.ఐ కె.యేసుబాబు, తాలుకా ఎస్ఐ, నందివాడ ఎస్సై, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు మెమోలు జారీ

- ప్రజాశక్తి కథనాలకు స్పందన

ప్రజాశక్తి-పెడన : నూరు గొడ్లను తిన్న రాబందు ఒక గాలి వానికి పడుతుందన్న చందంగా రెవెన్యూ అధికారులు, సిబ్బందిల పనితీరు తయారైంది. ఇప్పటికే పలువురు వీఆర్వోలకు రెండేసి సార్లు చొప్పున మెమోలు కూడా జారీ చేశారు. మరోసారి ఇలాగే జరిగితే సస్పెండ్ అవుతారంటూ ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేశారు. త్వరలో మండల స్థాయి అధికారులకు కూడా మెమోలు అలాగే సస్పెండ్ అయ్యే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. సేకరించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల్లో బుసక, నల్ల రేగడి మట్టిలను అక్రమంగా తవ్వుతున్న విషయం ప్రజాశక్తిలో పలు కథనాలు ప్రచురించిన సంఘటనలు పాఠకులకు విధేయతమే. వీటి పైన స్పందించిన ఉన్నతాధికారులు తాసిల్దార్ కు సంబంధిత విఆర్వో, వీఆర్ఏ లకు మెమోలు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో గత పక్షం రోజుల క్రితం ఒకసారి, ఇటీవల రెండు రోజులు క్రితం సమావేశం ఏర్పాటు చేసి కాకర్లమూడి, నందమూరు, జింజరు గ్రామాలతో పాటు మరో మూడు గ్రామాల వీఆర్వోలకు తాసిల్దార్ రెండవ సారి మెమొలు కూడా జారీ చేశారు. మరో మారు ఇలా జరిగితే సస్పెండ్ చేస్తామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : నిరుపేదలకు సంజీవినిల ఉపయోగ పడుతున్న ఆరోగ్యశ్రీ విషయంలో ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. గురువారం అవనిగడ్డలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి 1500 కోట్ల రూపాయలు బకాయిలు ఉంటే ఇప్పటి వరకు 350 కోట్లు చెల్లించామని ప్రభుత్వ అధికారులు చెప్పడం బాధాకరం అన్నారు. గత రాత్రి వరకు వివిధ వైద్యశాల సంఘాల వారితో సంప్రదింపులు జరపగా చర్చలు విఫలం అవడం అదేవిధంగా బుధవారం నుండి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని వారు హెచ్చరించడం బాధాకరమన్నారు. తక్షణమే పేదవారికి వైద్య సహాయం అందే విధంగా ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించి పేద కుటుంబాల వారి ప్రాణాలను కాపాడాలని వేణుగోపాలరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

క్లాప్ ఒప్పందం, చెత్త పన్ను రద్దు చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ: క్లాప్ వాహన ఒప్పందం, చెత్త పన్ను రద్దు చేయాలని సిపిఎం సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. క్లాప్ వాహన డ్రైవర్లకు వేతనాలు చెల్లించాలని, పారిశుధ్య నిర్వహణ బాధ్యత నగరపాలక సంస్థ చేపట్టాలని, ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని 27వ డివిజన్, దుర్గాపురం, సుందర్ నగర్ కాలనీ, గులాబీ తోట తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన స్థానిక నేతలతో కలిసి పర్యటించారు. ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో వైసిపి, టిడిపి అభ్యర్థులు విచ్చలవిడిగా డబ్బు పంచి ప్రజలను మభ్యపెట్టారని స్థానికులు వివరించారు. అధికార యంత్రాంగం డబ్బు పంపిణీని అరికట్టటంలో ఘోరంగా విఫలమైందని, ప్రేక్షక పాత్ర వహించిందని, గతంలో ఏ ఎన్నికల్లోనూ చూడనట్లుగా బహిరంగంగా, పట్టపగలు ఓట్లు కొనుగోలు చూశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ క్లీన్ ఏపీ (క్లాప్) పేరుతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చెత్త వాహనాల కాంట్రాక్టును బడా కంపెనీలకు కట్టబెట్టిందన్నారు. స్వచ్ఛభారత్ పేరుతో కేంద్రం, క్లీన్ ఏపీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చెత్త పన్ను భారాన్ని మోపాయని విమర్శించారు. చెత్త పన్ను వసూలు చేసి కాంట్రాక్టర్లకు కోట్ల రూపాయలు కట్టబెడుతున్నాయని పేర్కొన్నారు. కానీ చెత్త వాహనాల డ్రైవర్లకు మాత్రం కనీస వేతనాలు చెల్లించటం లేదన్నారు. ఈనెల వేతనాలు కూడా ఇవ్వకపోవడంతో డ్రైవర్లు సమ్మె బాట పట్టారని తెలిపారు. విఎంసి అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరించకుండా గాలికి వదిలేశారని విమర్శించారు. దీంతో పారిశుధ్య పరిస్థితి దిగజారుతోందన్నారు. మరోవైపు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించలేదని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల యాజమాన్యాలు సేవలు నిలిపివేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించాయని తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవలు ఆగకుండా ప్రభుత్వం యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో సిపిఎం నేతలు బి.రమణరావు, మల్లంపల్లి శివ, బాలాజీ, సాంబశివరావు, నాగేంద్రప్రసాద్, స్వామి, శివలింగం, బసవేశ్వరరావు, ఏడుకొండలు, పీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గాపురంలో పర్యటిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు



కేక్ కట్ చేస్తున్న చలసాని ఆంజనేయులు

ఆంజనేయులుకు సన్మానం

ప్రజాశక్తి-మైలవరం: కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం మైలవరం మండలంలోని కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘం బీఎంసీ పరిధిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు అప్పిడి సాంబిరెడ్డి మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ అభివృద్ధిలో చలసాని పాత్ర మరువలేనిదన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మైలవరం క్లస్టర్ మేనేజర్ పి యశ్వంత్, పుల్లూరు పిఎసిఎస్ అధ్యక్షులు చిలుకూరు రామిరెడ్డి, వేతన కార్యదర్శులు సూపర్వైజర్లు పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

1500 మందికి అన్నదానం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : ఎన్నికలోల టిడిపి విజయాన్ని ఆకాంక్షిస్తూ నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నిక కావాలని రెడ్డిగూడెం టిడిపి యువ నాయకుడు బొమ్మిన కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అరుణాచలంలో గిరి ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా బొమ్మిన కోటేశ్వరరావు ద్వారా 1500 మంది యాత్రికులకు అన్నదానం నిర్వహించారు. రి



సోనీ బ్రావియా-2 విడుదల

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: సోనీ కంపెనీ నుండి సరికొత్తగా బ్రావియా 2 సిరీస్ టివిని మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ ప్రతినిధి ఎల్. ఈశ్వర్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని సోనీ షోరూమ్‌లో బ్రావియా టీవీల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 4కె అల్ట్రా హెచ్.డి. ఎల్ఈడి డిస్ప్లే సాంకేతిక ఉందని ఇది అప్‌గ్రేడ్ చేయాలనుకునే వారికి మెరుగైన వినోదాన్ని అందించడమే లక్ష్యంగా నూతన ఆవిష్కరణలు చేసినట్లు తెలిపారు. వివిధ రకాలైన గేమింగ్ సెషన్స్ కూడా అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేకంగా రూపొందించారన్నారు. బ్రావియా 2 సిరీస్ అద్భుతమైన వీక్షణ అనుభవాన్ని అందిస్తుందని తెలిపారు. బ్రావియా 2 సిరీస్ ఎస్ 25వేరియంట్ ఇది అసమానమైన గేమింగ్ సామర్థ్యాలను అందిస్తుందని తెలిపారు వీటితో పాటు ఇతర ఫీచర్లు కూడా ఉన్నాయని తెలిపారు. సోనీతో పాటు అన్ని ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు.



క్రాఫ్ట్ వర్క్‌లో శిక్షణ

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల శాఖా గ్రంథాలయం నిర్విరామంగా వేసవివిజ్ఞానశిబిరం కొనసాగుతుంది. గురువారం 23వ రోజు పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు క్రాఫ్ట్ వర్క్ భవిత స్కూల్ హెచ్.ఎం.కనకారావు విద్యార్థులకు క్రాఫ్ట్ వర్క్ నేర్పించారు. అలానే కవి, డ్రాయింగ్ మాస్టర్ సర్వేశ్వర రావు డ్రాయింగ్ నేర్పినారు.యోగా మాస్టర్ ఎమ్. మాణిక్యాలరావు విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. అనంతరం విద్యార్థులు పుస్తక పఠనం చేశారు,చెస్ విద్యార్థులకు నేర్పించడమయినది. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు గారు పర్యవేక్షించారు.

వాసవి సేవలు అభినందనీయం : తూనికుంట్ల



ప్రజాశక్తి-వన్‌టౌన్: వాసవి - విజయవాడ సేవలు అపూర్వమని కెబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. వాసవి - విజయవాడ సంస్థ ఆధ్వర్యంలో ఎంఎస్ఆర్ హైస్కూల్ వద్ద 45 రోజులుగా నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రం ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన తూనికుంట్ల శ్రీనివాసు మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని పురస్కరించుకొని వాసవి విజయవాడ సంస్థ గడచిన రెండు దశాబ్దాలుగా మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహించటం అభినందనీయమన్నారు. ముఖ్యంగా పాతబస్తీకి నిత్యం లక్షలాది మంది వ్యాపార వర్గాలు, స్థానిక ప్రజానీకం రాకపోకలు సాగిస్తుంటారన్నారు. అటువంటి వారికి మజ్జిగను అందించటం మంచి సేవ చేయటమేనన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టా అమర్‌సుధీర్, మాజేటి రామచంద్రరావు, కార్యక్రమ కన్వీనర్ జల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



లింగాలపాడులో తిరునాళ్ల ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ: లింగాలపాడు గ్రామంలోని శ్రీ లక్ష్మీ పేరంటాల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో వై సీతారామయ్య పర్యవేక్షణ లో ఆలయ అధికారులు ఆధ్వర్యంలో అఖండ జ్యోతి, శ్రీ లక్ష్మీ పేరంటాల అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు అర్చనలు జరిగాయి. శ్రీ లక్ష్మీ పేరంటాల అమ్మవారి పుట్టినిల్లు పల్నాడు జిల్లా దుర్గి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన దిగుమతి కుటుంబ సభ్యులు, మెట్టినిల్లు వారైనా లింగాలపాడు గ్రామానికి చెందిన చిరుమామిళ్ల కుటుంబ సభ్యులు మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించారు.సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ రవి కిరణ్ ఆధ్వర్యంలో సీఐ హనీష్ ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎంఇఒ అవినీతిపై విచారణ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇబ్రహీంపట్నం ఎంఈవో సిహెచ్.పుష్పలతపై జిల్లా పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (సర్వీసెస్) జి.రాజేశ్వరి గురువారం విచారణ చేపట్టారు. విచారణకు ఉపాధ్యాయ సంఘాల నేతలు హాజరయ్యారు. గతంలో ఉపాధ్యాయుల నుంచి ఎంఈవో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలతో పత్రికల్లో కథనాలు రావడంతో డీఈవోకి నందిగామ డీవైఈవో రిపోర్ట్ చేశారు. డీఈవో సుబ్బారావు ఆదేశాల మేరకు విచారణ అసిస్టెంట్ డైరెక్టర్



ఇబ్రహీంపట్నం ఎంఈవో కార్యాలయంలో ఎంఇఒను, మూడు యూనియన్ల నాయకులను విచారించారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి : ఎసిపి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఎన్నికలు ముగిశాక జరిగిన ఘటనలు దష్టిలో ఉంచుకుని విజయవాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యా త్మక ప్రాంతాలను గుర్తించామని, వాటిపై ప్రత్యేక దష్టి సారించి పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని విజయవాడ వెస్ట్ ఏసీపీ మురళీ కష్ణారెడ్డి అన్నారు. గురువారం పాత రాజరాజేశ్వరి పేటలో పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి, స్థానిక యువకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వెస్ట్ ఏసిపి మురళీ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి.రామకష్ణ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలు జరిగేందుకు వీలున్న ప్రాంతాల్లో క్షుణ్ణంగా సోదాలు చేస్తున్నామని పేర్కొన్నారు. మద్యం, మందు గుండు సామగ్రి అక్రమ నిల్వలపై, అనుమానం ఉన్న వ్యక్తుల గురించి ఆరా తీస్తున్నామని వెల్లడించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పూర్తి నిఘా ఏర్పాటు చేశామని, ఓట్ల లెక్కింపు రోజు, ఫలితాల అనంతరం ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన, అసత్య ప్రచారంతో వివాదాలు సష్టించేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు రౌడీ షీట్ తెరుస్తామని హెచ్చరించారు. అసాంఘిక శక్తులను గుర్తించేందుకు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు, ఫుట్ పెట్రోలింగ్, వాహన తనిఖీలు నిర్వహిస్తూ పాత నేరస్తులను గుర్తిస్తున్నామని వివరించారు. సామాన్య ప్రజలకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సీఐ గణేష్ మరియు ఎస్.ఐ. ఆచారి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



రాజరాజేశ్వరిపేటలో స్థానిక యువకులతో మాట్లాడుతున్న వెస్ట్ ఏసిపి మురళీకృష్ణారెడ్డి